క్లుప్తంగా

హత్యాయత్నం కేసును విత్‌డ్రా చేసుకోవాలి



బోధన్: తమ పార్టీ కార్యకర్తలపై అక్రమంగా హత్యాయత్నం కేసు పెట్టి జైలులో పెట్టారని, ఈ కేసును విత్‌డ్రా చేసుకోవాలని కోరుతూ సోమవారం బోధన్ ఆర్డీవో ఆఫీసులో అధికారి వసీంకు ఎంఐఎం నాయకులు వినతి పత్రం అందించారు. ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పట్టణంలోని రెంజల్‌బేస్‌కాలనీకి గత నెల 16న వెళ్లిన ఎమ్మెల్యే షకీల్‌ను ఆ ప్రాంతంలో ఎంఐఎం నాయకులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు అల్తాఫ్, నవీద్‌లతో పాటు మరి కొంత మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

మాక్లూర్: రాబోయే రోజుల్లో బూత్ సభ్యులు బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చే విధంగా సైనికుల్లాగా పనిచేయాలని తమిళనాడు నుంచి విచ్చేసిన విస్తారక్ రాజేంద్ర పేర్కొన్నారు. సోమవారం మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా మాణిక్‌బండార్ అమ్రద్ శక్తి కేంద్ర, బూత్ అధ్యక్షులను కలిశారు. విస్తారక్ మాట్లాడుతూ.. పార్టీ బలాబలాలు ఎన్నికలకు సంబంధించి బూతు కమిటీలు పన్నా ప్రముఖులను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గంగోని సంతోష్, శివలాల్, దావత్ రమేష్, అమ్రాద్ రమేష్, అమ్రాద్ తండా వినోద్, ఆరిఫ్‌లు పాల్గొన్నారు.

రానున్నది డబుల్ ఇంజన్ సర్కారే

నవీపేట: రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయ దుంధుబి మోగించి, కేంద్రంతో పాటు రాష్ట్రంలో అధికారాన్ని చేపడుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం నిర్వహించిన మేరా బూత్ సబ్సే మజ్బూత్, సంపర్క్ సే సమర్థన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులపై గడపగడపకు బీజేపీ ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ బాధ్యతల్ని చేపట్టి, దేశాన్ని మరింత అభివృద్ధి చేస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసపూరిత హామీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. బీజేపీకి గ్రామాలలో విశేష ఆదరణ లభిస్తుందన్నారు. తమిళనాడు విస్తారక్ ఆర్‌కే మణి, తదితరులు పాల్గొన్నారు.

జూట్ బ్యాగులు వాడాలి

ఆర్మూర్‌టౌన్: ప్లాస్టిక్ వాడకం తగ్గించి జూట్ బ్యాగులు వాడాలని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథ పురం అధ్యక్షుడు మోహన్‌దాస్ అన్నారు. పట్టణంలోని రాంమందిర్ పాఠశాలలో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరు నిషేధించాలని ఆయన అన్నారు. హెచ్‌ఎం చలం, లయన్ కార్యదర్శి రఫీయుద్దీన్, రాజన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలను సిద్ధంగా ఉంచండి

బాల్కొండ: హరితహారంలో భాగంగా నాటటానికి మొక్కలను సిద్ధంగా ఉంచాలని మెండోరా ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోడిచర్ల గ్రామంలో నర్సరీని పరిశీలించారు. మొక్కలను సిద్ధం చేయాలన్నారు. అనంతరం పల్లె ప్రగతిలో నిర్మించిన క్రీడా ప్రాంగాణాన్ని, ఇరిగేషన్ భూముల్లో మొక్కలు నాటటానికి తవ్విన గుంతలను పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త!

రుద్రూర్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోటగిరి ఏఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పొతంగల్ మండలం సుంకిని, హంగర్గఫారంలో సోమవారం కమ్యూనిటీ పోలిసింగ్ భాగంగా సైబర్ నేరాలు– తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో అపరిచితులకు ఓటీపీ చెప్పద్దని, అనవసర లింక్‌లు ఓపెన్ చేయద్దని సూచించారు. పలు జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు ఎజాజ్‌ఖాన్, మాధవరావ్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై పేరెందుకు పెట్టలేదు

బోధన్: స్థానిక మున్సిపల్ 26వ వార్డు పరిధిలో ఈ నెల 19న జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ బోధన్ బ్రాంచ్ నూతన భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ అయిన తనకు ఆహ్వానించలేదని, శిలాఫలకంపై తన పేరు ఎందుకు పెట్టలేదో సమాధానం ఇవ్వాలని కోరుతూ సోమవారం ఆ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మనూషను కలిసి కౌన్సిలర్ భర్త దామోదర్, కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందించారు.

అర్హులకే పట్టాలు అందించాలి

రెంజల్(బోధన్): అర్హులైన వారిని గుర్తించి ఇళ్ల పట్టాలు అందించాలని కోరుతూ తాడ్‌బిలోలి గ్రామస్తులు సోమవారం డీటీ శశిభూషణ్‌కు వినతిపత్రం అందించారు. కార్యాలయం ముందు బైఠాయించి అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే న్యాయం చేయాలన్నారు. గత జాబితాలో అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- చెట్లు ఇంకాస్త పెరిగితే రాత్రివేళల్లో భారీ వాహనాలకు తగిలే అవకాశం
- ప్రమాదాలు జరగకముందే తొలగిస్తే మేలంటున్న స్థానికులు



కొటార్మూర్ వద్ద జాతీయ రహదారిపైకి వచ్చిన చెట్ల కొమ్మలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ 63వ నెంబరు జాతీయ రహదారిపైకి వచ్చిన చెట్ల కొమ్మలతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురువుతున్నాయి. చెట్ల కొమ్మలు రహదారి మధ్యలోకి రావడంతో చిన్న పాటి కార్గో వాహనాలు, భారీ వాహనాలకు ఆటంకం ఏర్పడుతోంది. పెర్కిట్ గ్రామం 63, 44వ నెంబరు జాతీయ రహదారిల కూడలి కావడంతో నిత్యం అనేక వాహనాలతో రద్దీగా ఉంటుంది. కరీంనగర్ వైపు వెళ్లడానికి కొటార్మూర్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అలాగే పెర్కిట్ గ్రామం కూరగాయల మార్కెట్‌కు ప్రసిద్ధి కావడంతో కొటార్మూర్ మీదుగా రవాణ సాగుతోంది. దీంతో వాహనాలకు చెట్ల కొమ్మలు తగిలి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. అలాగే వర్షాకాల సీజన్ కావడంతో చెట్ల కొమ్మలు విరిగిపడితే వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం లేకపోలేదు. అలాగే కొటార్మూర్ మీదుగా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులపై చెట్ల కొమ్మలు విరిగి పడి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. చెట్ల కొమ్మ ఇంకా పెరిగితే రాత్రి వేళల్లో భారీ ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉంది. రహదారుల నిర్వహణ చేపట్టే ఎన్‌హెచ్‌ఏఐ సంస్థ చెట్ల కొమ్మలను తొలగించి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది



రహదారిపై చెట్ల కొమ్మలు ప్రమాదకరంగా మారాయి. రహదారి మీదుగా ప్రయాణించే వాహనాలకు ఆటంకం కలిగించే విధంగా కొమ్మలు మధ్యలోకి వచ్చాయి. చెట్ల కొమ్మలు విరిగి పడితే ప్రాణాలు పోయే పరిస్థితి లేక పోలేదు. కొమ్మలను తొలగించి ప్రమాదాన్ని నివారించాలి.

– ప్రసాద్, స్థానికుడు, కొటార్మూర్

ప్రజల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

- బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్



పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షకీల్



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న మందర్న గ్రామస్తులు

బోధన్‌టౌన్(బోధన్): ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నవీపేట్ గిరిజనులకు పోడు భూముల పట్టాలు, రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలిలోని ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పోడు భూముల కోసం గిరిజనులు 70 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని, గతంలో పాలించిన ప్రభుత్వాలు వారిని పట్టించుకున్న పాపాన పోలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న వారిని గుర్తించి సీఎం కేసీఆర్ వారికి పట్టాలు అందించారన్నారు. నవీపేట్ మండలంలోని నిజాంపూర్ గ్రామస్తులు 50 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలి

పట్టణంలోని ఇందూర్ మోడల్ పాఠశాలలో మంగళవారం నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని, ఈ జాబ్ మేళాకు 84 కంపెనీలు హాజరు కానున్నాయని, ఇప్పటికే 2 వేల మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకున్నారని, ఎన్‌రోల్ చేసుకోని వారు బుధవారం ఎన్‌రోల్ చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళా ఉదయం 10 గంటల నుంచి 5.30 గంటలకు వరకు సాగుతుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బోధన్ : పట్టణంలోని స్వగృహంలో ఎమ్మెల్యే షకీల్‌ను సోమవారం సాలూర మండలంలోని మందర్న గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. మూడు దశాబ్దాలకు పైగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు, 50 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ శివకుమార్, గ్రామస్తులు నాగురావు, నరేష్ పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యాన్ని వెలికితీయడానికే క్విజ్



కుమ్మన్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న నేతలు

బోధన్ రూరల్(బోధన్) : హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ ఇన్స్పిరేషన్‌తో యువతలోని నైపుణ్యాన్ని వెలికితీయడానికి, రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం సాలురా మండలంలోని కుమ్మన్‌పల్లిలో యువకులకు క్విజ్ కాంపిటీషన్‌పై అవగాహన కల్పించి వారితో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ల్యాప్‌టాప్, టాబ్లెట్, స్మార్ట్‌ఫోన్, స్మార్ట్‌వాచ్‌లాంటి బహుమతులను అందిచడంతో పాటు ప్రత్యేక బహుమతిగా బోధన్ నియోజకవర్గ మహిళా టాపర్‌కు ఎలక్ట్రిక్ స్కూటీని అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువకులు వెంటనే 7661 899 899 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి రిజిస్టర్ కావాలని కోరారు. కుమ్మన్ పల్లి గ్రామ అధ్యక్షులు బుడికే నరేష్ రెడ్డి, దొడ్ల నారాయణ రెడ్డి, శివ కుమార్, బుడికే రాజారెడ్డి, వినోద్ రెడ్డి, మేదర్ రమేష్, లాలయ్య, ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు అధికారమే పరమావధి

- బీజేపీ రాష్ట్ర నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్



బీజేపీలోకి మహిళలను ఆహ్వానిస్తున్న పార్టీ నేతలు

రుద్రూర్: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అధికారమే పరమావధిగా పని చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. రుద్రూర్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ మహాజన్ అభియాన్ కార్యకర్తల సమావేశానికి అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో చేపట్టిన పథకాల గురించి వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత రంగాలను విస్మరించి మద్యంపైన దృష్టి సారించిందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ విధించిన ఆదనపు వ్యాట్ వల్ల డీజిల్, పెట్రో ధరలు తెలంగాణలో అధికంగా ఉన్నాయని అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని విమర్శించారు. పరీక్ష పత్రాలు లీక్‌లు చేసి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారని ఆరోపించారు. గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన మహిళలు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాల్యాద్రి రెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అరుణతార, బాన్సువాడ సెగ్మెంట్ కన్వీనర్ కొత్తకొండ భాస్కర్, కో కన్వీనర్ భూపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు నర్సింహారెడ్డి, గంగాధర్ గౌడ్ తదితరులున్నారు.

లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టాలి



ముప్కాల్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా వెంటనే నీటి విడుదల చేపట్టాలని బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు ముస్కు నర్సయ్య, భూమేశ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ముప్కాల్ మండల కేంద్రంలో వారు మాట్లాడారు. జూలై మాసం వచ్చినా ఇప్పటి వరకు వర్షాలు కురువక రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం నిర్మించామని గొప్పలు చెప్పుకునే నాయకులకు ఆయకట్టు రైతుల అవస్థలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

శైవ ధర్మానికి ప్రత్యేక ప్రాతినిధ్యం



బోధన్: హైందవ సంస్కృతిలో శైవ ధర్మానికి ప్రత్యేక ప్రాతినిధ్యం ఉందని, ఇందులో భాగమైన జంగముల కులవృత్తి సాంప్రదాయిక భిక్షాటనని బోధన్‌కు చెందిన వీరశైవ జంగమ పురాణే, పొడయ్య మఠాల నిర్వాహకులు పేర్కొన్నారు. ఆషాఢ మాసం, గురు పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణ కేంద్రంలోని పాన్‌గల్లీలో తమ శిష్య బృందం వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యుల నివాసాల్లో ధర్మ భిక్ష కార్యక్రమం నిర్వహించారు. మఠాల నిర్వాహకులు పురాణే అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గురువులను సత్కరించడం ఆనవాయితీ



బోధన్: భారతీయ సంస్కృతి పరంపరలో గురువులను సత్కరించడం, వారి ఆశీర్వాదం పొందడం ఆనవాయితీగా వస్తోందని న్యాయవాదుల పేర్కొన్నారు. గురు పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని బోధన్‌లోని కోర్టులో సోమవారం సీనియర్ న్యాయవాది శేఖర్ బోధన్కర్‌ను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది శేఖర్‌ను సత్కరించినట్లు తెలిపారు. న్యాయవాదులు సీహెచ్‌వీ హన్మంత్‌రావు, లక్ష్మణ్, పోశెట్టి, సుధాకర్, కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్, శంకర్, రమేష్, రవీందర్, ధర్మయ్య, ప్రకాష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైతుల దీక్షలు

రెంజల్(బోధన్): రెంజల్ శివారు నుంచి ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి వరకు గల బందల్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నాటికి ఆరవ రోజుకు దీక్షలు చేరుకున్నాయి. రైతులు హన్మాండ్లు(బుజ్జి), చుక్కరాజుగౌడ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి

మాక్లూర్: సీఎం కేసీఆర్ వెంటనే పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుడ్డు గంగాధర్ డిమాండ్ చేశారు. మదనపల్లిలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. పోడు రైతులను రాష్ట్ర ప్రభుత్వం దగా చేసిందన్నారు. 11 లక్షల ఎకరాలకు పట్టాలు ఇస్తామంటూ గత బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించారని, కానీ ఇప్పుడు కేవలం నాలుగున్నర లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలిచ్చి పోడు రైతులను దగా చేశారని విమర్శించారు. సమావేశంలో మండల కార్యదర్శి నరసయ్య, లక్ష్మణ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక

వేల్పూర్: పడగల్‌కు చెందిన భువనగిరి అఖిల, బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ చదివిన అఖిల వార్షిక పరీక్షల్లో 9.8 జీపీఏ సాధించింది. దీంతో ఆమెకు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. గ్రామానికి చెందిన విద్యార్థినికి ట్రిపుల్ ఐటీలో సీటు రావడం పట్ల బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



కాల్‌పూర్‌లో యజ్ఞం చేస్తున్న భక్తులు



చందూర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆర్మూర్ టౌన్: సిద్ధుల గుట్టపై పల్లకీ సేవ చేస్తూ..

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని కేదారీశ్వర ఆశ్రమంతో పాటు మండలంలోని కౌల్‌పూర్‌లోని భూమయోగేశ్వర ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్‌కు భక్తులు తరలివచ్చి పాదపూజ చేశారు.

నవీపేటలో..

నవీపేట: మండల కేంద్రం శివారులోని స్వయంభూ శివాలయంలో సిద్ధాశ్రమ పీఠాధిపతి సిద్దేశ్వర మహరాజుకు భక్తులు ధనం, ధాన్యం, ఫలాలతో తులాభారం వేశారు. అలాగే అభ్యుదయ గ్రామీణ వికాస సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వేడుకలను చేశారు.

శివాలయంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ పండిత్ వినీత కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు నిర్వహించారు. నందీశ్వర మహారాజ్‌కు పాదపూజ చేసి, నూతన వస్త్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహించారు.

చందూర్‌లో..

రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలోని షిర్డి సాయి మందిరంలో, పోతంగల్ మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఎల్బీఎస్ నగర్ కాలనీలోని సాయిబాబా మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రుద్రూర్‌లో గోపాల కాల్వ వేడుకలు

రుద్రూర్: మండల కేంద్రంలో గురు పౌర్ణమి పురస్కరించుకొని గోపాల కాల్వ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయం వద్ద ప్రారంభమైన శోభయాత్ర ప్రధాన వీధుల ద్వారా కొనసాగింది. వివిధ ప్రాంతాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాంప్రదాయంగా ప్యాలాలు, బెల్లంతో చేసిన లడ్డూలు ఎగురవేశారు. వీటిని పట్టుకోవడానికి యువకులు, పిల్లలు ఉత్సాహంగా పరుగులు తీశారు.



బోధన్‌లోని సాయిబాబా ఆలయంలో పూజలు



రుద్రూర్‌లో గోపాల కాల్వ శోభాయాత్ర..

చౌడమ్మ కొండూర్ లిఫ్ట్ నుంచి నీటి విడుదల



నందిపేట్(ఆర్మూర్) : మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతంలోని చౌడమ్మ కొండూర్ ఎత్తిపోతల పథకం నుంచి సోమవారం స్థానిక నాయకులు నీటిని విడుదల చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురకపోవడంతో ఆయకట్టు రైతులు సాగు నీటి కోసం ఎదురు చూస్తున్నారు. స్థానిక నాయకులు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా అధికారులతో మాట్లాడి ఎమ్మెల్యే నీటి విడుదల చేయాలని ఆదేశించారు. సర్పంచులు దమ్మన్నగారి ప్రభాకర్‌రావు, రామడ పోశెట్టి, ఎంపీటీసీ ధాత్రికరాజు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

భీమ్‌గల్: దేవక్కపేట్ గ్రామానికి చెందిన గాయత్రి, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి వెంటనే స్పందించి చికిత్స కోసం రూ.2 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. సోమవారం కుటుంబ సభ్యులకు మంత్రి వేముల ఎల్‌వోసీ కాపీ అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

జీలుగ సాగుతో భూసారం పెరుగుతుంది

బాల్కొండ : జీలుగ సాగుతో భూసారం పెరుగుతుందని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రాల్లో సాగు చేసిన జీలుగ పంటను పరిశీలించారు. జీలుగు వేసిన 35 నుంచి 40 రోజుల్లో పూత వచ్చే దశలో నేలల్లో కలియదున్నాలన్నారు. దీంతో 40 నుంచి 60 టన్నుల సేంద్రియ పదార్థం భూమిలో చేరి భూసారం పెరుగుతుందన్నారు. జీలుగు సాగుతో 30 శాతం వరకు రసాయన ఎరువుల వాడకం తగ్గించవచ్చన్నారు. సొసైటీ వైస్ చైర్మన్ పెద్దబాలరాజు పాల్గొన్నారు.

గోవింద్‌పేట్ పీహెచ్‌సీలో డాక్టర్స్ డే



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్స్ డేని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు మానస, ఉమేరా యాస్మిన్‌లను వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. పవిత్రమైన వైద్య వృత్తి ద్వారా ప్రజలకు సేవలందించడం సంతోషంగా ఉందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు రవీందర్, ఆనవాల, ఫార్మసిస్టు లక్ష్మణ్, ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

రుక్మిణి ఆలయంలో 41వ మండల పూజ

మాక్లూర్: మండల కేంద్రంలోని రుక్మిణీ పాండురంగ విఠలేశ్వర ఆలయంలో సోమవారం 41వ మండల పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, ఆయన సోదరుడు మహేష్ గుప్తాలు సతీ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. మేయర్ దండు నీతుకిరణ్, బీఆర్ఎస్ నాయకులు సుజీత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాష్, స్థానిక సర్పంచ్ అశోక్‌రావు పాల్గొన్నారు.

తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – ఆదిపురుష్ (3డీ-తెలుగు) - 12.20, 9.45 ; లవ్ యూ రామ్ - 4.05; నారాయణ అండ్ కో - 6.45
- స్క్రీన్-2 – ఎస్‌పీవై (తెలుగు) - 10.50, 1.45, 4.40, 07.35, 10.30
- స్క్రీన్-3 – సత్యప్రేమ్‌కీ కథ (హిందీ) - 10.00, 4.10, 10.20; సామజవరగమన - 1.10, 7.20
- స్క్రీన్-4 – ఈ నగరానికి ఏమైంది - 1.00; సామజవరగమన - 4.00; ఇండియానా జోన్స్ (తెలుగు) - 7.00; మాయపేటిక - 10.20

పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

బోధన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సోమవారం బోధన్ మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో నాగ్‌నాథ్‌కు ఏఐఎస్‌బీ(ఆలిండియా స్టూడెంట్ బ్లాక్) నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగ్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులను భర్తీ చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతోందని ఆరోపించారు. ఇంకా కొన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందలేదని తెలిపారు. మధ్యాహ్న బోజనం మెనూ రేటు పెంచాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ నేతలెవరూ బీఆర్ఎస్‌లో చేరలేదు

భీమ్‌గల్: కాంగ్రెస్ పార్టీ సభ్యులెవరూ బీఆర్ఎస్ పార్టీలో చేరలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె నర్సయ్య తెలిపారు. సోమవారం పట్టణ కేంద్రంలో బొదిరె నర్సయ్య మాట్లాడుతూ.. ఆదివారం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన కర్నె సత్య గంగయ్యను 2018 అసెంబ్లీ ఎన్నికల తరువాత పార్టీ పక్కన పెట్టిందని, అలాంటి వ్యక్తిని బీఆర్ఎస్‌లో చేర్చుకొని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడిని పార్టీలో చేర్చుకున్నామని చెప్పడం బీఆర్ఎస్ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. .